వరదునికి ఘనంగా తిరుప్పావై సేవ

కాణిపాకం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా స్వామివారికి తిరుప్పావైసేవ(అన్నకూటోత్సవం) ను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాకర్లవారిపల్లెకు చెందిన పట్టాభినాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉప ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మండపంలో స్వామివారి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి వండిన పులిహోర అన్నంను రాశిగా పోసి వివిధ రకాల పూలు పండ్లను వుంచి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం రాశిలోని పులిహోరను ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

అందాల పోటీలు సంస్కృతికి విరుద్ధం

మహిళలు స్వశక్తితో ఎదగాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

గూడూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

అందాల పోటీలు సంస్కృతికి విరుద్ధమని, మహిళలు స్వశక్తితో పైకి ఎదగాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని బొడ్డు చౌక ప్రాంతంలో ఉన్న లలిత ఎక్స్ క్లూజివ్ అవుట్ లెట్ కావేరి ఫుడ్ ప్రొడక్ట్స్ ను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా గూడూరు పోటుపాలెం జాతీయ రహదారి వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం కావేరి ప్రొడక్ట్స్ షాప్ ప్రతినిధులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు శాలువా, పుష్పగుచ్చంతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ త్వరలో తెలంగాణలో మహిళలకు అందాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందాల పోటీల పేరుతో మహిళలను విధిల్లోకి తీసుకు రావడం ఎంత వరకు సబబు అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. మహిళల ఆర్థిక స్వాలంభన కోసం ప్రభుత్వాలు పని చేయాలని సూచించారు. ఎంతో పేరు, ప్రఖ్యాతులు కల్గిన లలిత బ్రాండ్ ప్రొడక్ట్స్‌ను గూడూరు ప్రజలకు అందిస్తున్న కావేరి ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రతినిధులు పావని, సునీల్ కుమార్‌ను అభినందించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ కె.రమణయ్య , డాక్టర్ నిర్మల, కావేరి ఫుడ్ ప్రొడక్ట్స్ యజమానులు పావని, సునీల్ కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, చిన్నం పెంచలయ్య , సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, సీపీఐ చిల్లా కూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐటియుసి నియోజక వర్గ కార్యదర్శి నారాయణ, శ్రీను, సంధాని, దానియేల్, వెంకటయ్య, ఆటో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

లగేజీ డిపాజిట్ తరహాలో
పాదరక్షలు డిపాజిట్‌కు ఆర్ఎఫ్ఐడి విధానం

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

తిరుమల పవిత్రతను మరింతగా పరిరక్షించే దిశగా టిటిడి చర్యలు తీసుకుంది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తున్న భక్తులు తమ విలువైన వస్తువులను, లగేజీలను భద్రపరిచేందుకు అమలవుతున్న డిపాజిట్ విధానాన్ని ఇప్పుడు భక్తుల పాదరక్షల డిపాజిట్ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి భక్తుల నుండి తీసుకున్న అభిప్రాయాలు, సూచనలతో తిరుమలలో తొలుత ఏటిసి కూడలి వద్ద ఒక కౌంటర్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కౌంటర్ వద్ద భక్తులు తమ పాదరక్షలను కౌంటర్‌లోని సిబ్బంది తీసుకుని భక్తుల ఫోటో,ఫోన్‌నంబర్ ఫీడ్ చేసి రశీదు ఇస్తారు. పాదరక్షలను ఆర్ఎఫ్ఐడి ఉన్న సంచిలో వేసి దాని నంబర్ ఆధారంగా స్కాన్ చేస్తారు. ఆలయంలోనికి వెళ్ళి శ్రీవారిని దర్శించుకున్న తరువాత ఆలయం వెలుపలకు వస్తారు. ఆ తరువాత తిరిగి వచ్చి రశీదు చూపిస్తే స్కాన్‌చేసి కౌంటర్‌లో ఏ వరుసలో,ఏ ర్యాక్‌లో ఆ నంబర్‌తో ఉన్న పాదరక్షలు సులభంగా గుర్తించి భక్తులకు తిరిగి అందిస్తున్నారు. భక్తులు ఈ విధానంతో సంతృప్తి చెందుతున్నారు. అంతేగాక భక్తులతో అదనపు ఇఓ వెంకయ్యచౌదరి స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. 98శాతంమంది భక్తులు నూతన విధానంలో పాదరక్షలు భద్రంగా తిరిగి పొందుతున్నామన్నారు. నూతన విధానం విజయవంతం కావడంతో మరో నాలుగు చోట్ల భక్తుల రద్దీ,ప్రధాన ప్రాంతాల్లో ఈ కౌంటర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చౌదరి తెలిపారు.

-ఆలయం ముందు, వైకుంఠమ్ ప్రాంతంలోనూ:

తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడటంలో భక్తులు కూడా టిటిడికి సహకరిస్తున్నారు. శ్రీవారి దర్శనానికి తరలివస్తున్న లక్షమందిభక్తులకుపైగా ధరిస్తున్న పాదరక్షలు ఇబ్బడిముబ్బడిగా ఆలయం ఎదురుగా వాహనమండపం సమీపంలో, ఆస్థానమండపం వద్ద, బేడి ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో ,వాహనమండపం, తూర్పుగేట్ వద్ద పాదరక్షలు వదలిపెట్టేయడం కనిపిస్తోంది. ఇదంతా ఇకరానున్న రోజుల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా సురక్షితంగా ఉచిత కౌంటర్లలో భద్రపరిచేలా చర్యలు తీసుకుంటున్నారు. లా ఎక్కడబడితే అక్కడ పాదరక్షలు వదలివెళ్ళడం కాదని ఉచిత కౌంటర్లలోనే భద్రపరచాలని అదనపు ఈఓ వెంకయ్యచౌదరి భక్తులకు సూచించారు.

కానరాని లోకాలకు వెళ్ళిన కొడుకు..తిరిగిరాని లోకాలకు తండ్రి..!

కుమారుని ఆత్మహత్య..జీర్ణించుకోలేక తండ్రి కూడా ఆత్మహత్య..!

గంగవరం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

ఒకే ఇంట్లో 90 రోజుల్లో మనస్థాపంతో తండ్రి, కొడుకు బలవన్మరణంకు పాల్పడిన విషాద సంఘటన పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. పలమనేరు మున్సిపాల్టీ మారెమ్మగుడి వద్ద నివాసం ఉంటున్న వెంకటరమణ,వనజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, చిన్న కుమారుడు కిరణ్‌కుమార్(27) వైద్య వృత్తిని అభ్యసించి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో దంత వైద్యుడిగా స్థిరపడిన అతను ఓ అమ్మాయిని ప్రేమించి ప్రేమ విఫలం కావడంతో మూడు నెలల క్రితం బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్నాడు.చిన్న కొడుకే జీవితంగా భావించిన తండ్రి కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక మూడు నెలలుగా మతిస్థిమితం కోల్పోయి మనోవేదనతో నిర్జీవమైనాడు.ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం భార్యకు చిన్నూరుగ్రామం వరకు వెళ్ళి వస్తానని చెప్పి తన ద్విచక్రవాహనంలో మండలంలోని దండ పల్లె, శంకర్రాయల్‌పేట రహదారిలోని కౌండిన్య నది సమీపంలోని చింత చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వఆసుపత్రికి తరలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి లక్ష్యంగా నూతన కోర్సులు అవసరం

- ఢిల్లీ జాతీయ సదస్సులో వీసీ అప్పారావు

తిరుపతి విద్య, ఏప్రిల్ 30 ప్రభాత వార్త

విద్యార్థులకు ఉపాధే లక్ష్యంగా స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ అందించి అధునాతన అవసరాలను దృష్టిలో పెట్టుకుని నూతన కోర్సులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు అభిప్రాయపడ్డారు. బుధవారం ఢిల్లీ వేధికగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ భవిష్యత్తు నూతన రంగాలలో కోర్సులు అనే అంశంపై జరిగిన రెండు రోజుల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కొత్త టెక్నాలజీ,డేటా సైన్స్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,సైబర్ సెక్యూరిటీ, బయోటెక్నాలజీ వంటి రంగాలలో కొత్త కోర్సులు తీసుకురావాలని సూచించారు. విద్యా ర్థులకు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కోర్సులను రూపొం దించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, పరిశ్రమల మధ్య అనుసం ధానం పెంచి, పరిశ్రమలతో కలిసి కోర్సులు రూపొందించడం, ఇంటర్న్షిప్, ప్రాజెక్టు చేయించటం వల్ల విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం పెరుగుతుందని తెలిపారు.ఉపాధ్యాయుల శిక్షణ, డిజిటల్ మాధ్యమాల వాడకం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలన్న అంశాలను ప్రస్తావించారు.ఈ సదస్సులో ఎస్వీయూ నుంచి రూసా కోఆర్డినేటర్ రమశ్రీ, సీఈఓ వంశీ రాయల్ పాల్గొన్నారు.

నీట్ నిర్వహణకు పక్కా ఏర్పాట్లు : కలెక్టర్

చిత్తూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

నీట్-2025 ప్రవేశ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు నీట్-2025 ప్రవేశ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య, అగ్నిమాపకశాఖ, ఆర్టీసీ ఇతర సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎఎంఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎన్‌టిఎ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహిస్తున్న నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షలు జిల్లా కేంద్రం చిత్తూరులోని పివికెఎన్ డిగ్రీ కళాశాలలో 432 మంది విద్యార్థులు, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో 274 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద, ప్రశ్నాపత్రాలు భద్రపరిచే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పోలీసు ఎస్కార్ట్ సహాయంతో ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలను తరలించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చుడాలని, జనరేటర్‌లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్షా సెంటర్లకు నిర్దేశించిన ప్రాంతం అవతల విద్యార్థుల తల్లిదండ్రులు వేచి వుండటానికి షామియానా, నీటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

నీట్-2024 ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అదికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు.

సింహాచలం అప్పన్నకు
టిటిడి పట్టువస్త్రాలు

తిరుమల,ఏప్రిల్ 30ప్రభాతవార్తప్రతినిధి:

విశాఖపట్నంసమీపంలోని సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి అప్పన్నకు టిటిడి పట్టువస్త్రాలు తీసుకెళ్ళి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు సమర్పించారు. 1998 నుండి టిటిడి ఈ ఆనవాయితీని పాటిస్తోంది. బుధవారం ఉదయం ఛైర్మన్ నాయుడు దంపతులు సింహాచలం చేరుకుని స్వామివారికి సమర్పించారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, బొక్కసం ఇన్‌ఛార్జి గురురాజ్ పాల్గొన్నారు.

గౌని చెరువులో సేద తీర్తుతున్న గజరాజులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

మొగిలి ఘాట్ అటవీ ప్రాంతంలోని గౌని చెరువులో గజ రాజులు సేద తీరాయి. సమీప అటవీ ప్రాంతం నుండి రెండు ఏనుగులు చెరువులోకి వచ్చి కొంత సేపు సేద తీరి తిరిగి అడవి వైపుకు వెళ్ళాయి. సమీప పశువుల కాపర్లు గజరాజులను చూసి భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఈ విషయంను అటవీశాఖ అధికారులకు పశువుల కాపర్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు గౌని చెరువుకు చేరుకుని చెరువులో సేద తీరుతున్న గజరాజులను అటవీ వైపుకు మళ్ళించారు.

నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : జిల్లా రెవెన్యూ అధికారి

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త ః

జిల్లాలో మే 4న నీట్ యూజీ -2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాలులో నీట్ యూజీ-2025 పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ నీట్ సిటీ కో-ఆర్డినేటర్ హేమంత్ పాండ్య, జిల్లా అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారిలతో కలిసి సమావేశం నిర్వహించారు. డీఆర్వో నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం పది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గూడూరు నందు ఒక పరీక్ష కేంద్ర, తిరుపతి జిల్లా కేంద్రంలో తొమ్మిది పరీక్షా కేంద్రాలున్నాయని తెలిపారు.ఈ పరీక్షల్లో మొత్తం 4489 మంది విద్యార్థులు హాజరవుతారని, పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ కట్టుదిట్టమైన భద్రతతో పాటు విద్యార్థులకు అవసరమైన తాగునీరు, అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో వీల్ ఛైర్‌లను, సహాయకులకు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను సూచించారు. ఈ సమావేశంలో వైద్యశాఖ అధికారి, విద్యుత్ శాఖాధి కారి, చీఫ్ సూపరింటెండెంట్స్ విద్యాశాఖాధికారులు, నీట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. తిరుపతి నగర పరిధిలోశ్రీ పద్మావతి గర్ల్స్ హైస్కూల్, వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ, పీఎం కేంద్రీయ విద్యాలయ నెంబర్ 1, తిరుపతి, హరేకృష్ణ రోడ్, ఎంసీఆర్ కాలనీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఉమెన్ యూనివర్శిటీ) శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎగ్జామినేషన్ హాల్, పద్మావతి నగర్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) నియర్ లక్ష్మీపురం సర్కిల్, తిరుచానూరు రోడ్డు, శ్రీ పద్మావతి ఉమెన్, డిగ్రీ అండ్ పీజీ కళాశాల (టీటీడీ) వింగ్-ఏ, ఎస్వీయూనివర్శిటీ నియర్ శ్రీపద్మావతి గెస్ట్ హౌస్, శ్రీ పద్మావతి ఉమెన్ డిగ్రీ కళాశాల అండ్ పీజీ కళాశాల (టీటీడీ) వింగ్-బి, ఎస్వీయూనివర్శిటీ పద్మావతి గెస్ట్ హౌస్, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ క్యాంపస్ హైస్కూల్, వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ (టీటీడీ), నియర్ సంస్కృత విద్యాపీఠం, ఎల్‌ఐసీ రోడ్డు, బాలాజీ కాలనీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (టీటీడీ) వింగ్-ఏ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (టీటీడీ) వింగ్ బాలాజీ కాలనీ, డీఆర్‌డబ్ల్యూ జూనియర్ కాలేజ్, గూడూర్, జెడ్పీ హైస్కూల్ రోడ్డు, గూడూరులో ఏర్పాటు చేశారు.

నకిలీ ధృవపత్రాలతో రిజిస్ట్రేషన్లు..!

పలమనేరు,ఏప్రిల్ 30,ప్రభాతవార్త:

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను గ్రామకంఠంగా పరిగణిస్తూ ఆ స్థలాలో నివాసం ఉన్న వారికి ఇంటి స్థలాలను రిజిస్టరు చేసుకునే సౌలభ్యన్ని ప్రభుత్వం కల్పించడం జరి గింది. దీంతో పలమనేరు పట్టణం మరియు రూరల్ పరిధిలో గ్రామకంఠ భూములలో ఇంటి నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్న పేదలు వారి ఇంటిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వద్ద నివాస దృవపత్రం పొంది వాటి ద్వారా స్థానిక సబ్ రిజిష్టరు కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. అయితే ఇదే అదునుగా కొందరు కేటుగాళ్లు నకిలీ దృవపత్రాల ద్వారా రాచమార్గంలో రిజిస్ట్రేషన్లు చేపట్టి లక్షలలో ఆర్జిస్తూన్నారు.గత 4 సంవత్సరాలుగా గ్రామకంఠంలోని నివాసితులు వారి వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తూ చేసుకుంటు అధికారుల పరిశీలన తరువాత సిబ్బంది నివేదిక మేరకు తహసీల్దార్ లబ్ధిదారులకు దృవపత్రాలను మంజూరు చేస్తున్నారు.అయితే సరైన రికార్డులు లేని కొందరు అక్రమ మార్గాలలో స్థానికంగా కొందరి మరియు ఇంటి దొంగల సహకారంతో నకిలీ దృవపత్రాలను ఏర్పాటు చేసుకుని వాటిని రాచమార్గంలో రిజిష్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేస్తూ లక్షలను ఆర్జిస్తున్నారు.

రూ.లక్ష కొట్టు దృవపత్రం పట్టు:

లక్షలు ఆర్జిస్తున్న కేటుగాళ్లు

రూ.లక్ష నుండి రూ.1.50 లక్షలు దళారులకు అందిస్తే చాలు ఎటువంటి ఆధారాలు లేకున్నా అసలు స్థలం,ఇల్లు లేక పోయిన తహసీల్దార్ కార్యాలయ ముద్రతో పాటు తహసీల్దార్ సంతకముతో దృవపత్రాలను కేటుగాళ్లు సృష్టించి కోరిన వారికి ఇవ్వడం జరుగుతుంది.గత 6 నెలలలో సుమారు వందల సంఖ్యలో నకిలీ దృవపత్రాలలో రిజిష్టేషన్లు జరిగినట్లు సమాచారం.అయితే ఇంటి దొంగల సహకారం లేకుండా దళారులు ఇంత విచ్చలవిడిగా దృవపత్రాలను సృష్టించలేరన్న విమర్శలు లేకపోలేదు. .

పేదల ఆశ దళారులకు అవకాశంగా మారింది:

నిరుపేదలు వారి అవసరాలకు అనేక ప్రాంతాలలో అనేక వ్యక్తుల వద్ద రుణాలు తీసుకోవడం అధిక వడ్డీతో తీసుకున్న నగదు సకాలంలో చెల్లించక పోవడంతో ఇబ్బందులుపడుతున్న క్రమంలో వారికి వారి ఇంటికి దృవపత్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రైవేటు బ్యాంకులలో ఇంటిపై రుణం తీసి ఇస్తామంటు వారి ఆశలను అవకాశంగా దళారులు మార్చుకుని వారి వద్ద లక్షలలో నగ దు తీసుకుని నకిలీ దృవపత్రాలతో రిజిస్ట్రేషన్లను చేపడుతున్నారని తెలుస్తుంది. కొంత కాలంగా పలమనేరు సబ్ రిజిష్టరు కార్యాల యంలో దృవపత్రాలపై అధికారులు ఆరా తీయడంతో దళారులు పలమనేరు ప్రాంతాలకు చెందిన గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్లను చిత్తూరు సబ్ రిజిష్టరు కార్యాలయంలో రిజిష్టరు చేపడుతున్నారు.

దళారులకు ఇంటి దొంగల సహకారం ఉందా..!

దళారులు యదేచ్ఛగా నకిలీ దృవపత్రాలతో రిజిస్ట్రేషన్లు చేస్తూన్నప్పటికి సంబంధిత అధికారులు వాటిపై ఆరా తీయక పోవడం పలు అనుమానాలకు తీవునిస్తూంది.గత 6 నెలలుగా నకిలీ దృవపత్రాలతో చిత్తూరు రిజిష్టరు కార్యాలయం,పలమనేరు సబ్ రిజిష్టరు కార్యాలయాలలో రిజిష్టేషన్లు జరుగుతునప్పటికి సం బంధిత అధికారులు వారి ఆ విషయం పట్టనట్లు వ్యవహ రిస్తున్నారని విమర్శలు లేకపోలేదు.అసలైన లబ్ధిదారులు నెలలు కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేసినప్పటికి అధికారులు దృవపత్రాలను ఇవ్వని పరిస్థితులలో దళారులు గంటలలో దృవపత్రాలను తీసుకురావడం పలు అనుమానాలకు తీవునిస్తూంది.ఇంటి దొంగల అండదండలతో దళారులు యదేచ్ఛగా లక్షలను ఆర్జిస్తుంటే అసలైన లబ్ధిదారులు మాత్రం నెలల తరబడి కార్యాలయాల చుట్టు ప్రదక్షణలు చేయక తప్పలేదు.ఇప్పటికైన సంబంధిత అధికారులు నకలీ దృవపత్రాలను గుర్తించి వారికి ఎవరు ఆ దృవపత్రాలను అందించారు వారికి ఎవరు సహకరించారు అన్న విషయాలను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకుంటారా అన్న విషయం వేచిచూడాల్సి ఉంది.

జమిలి ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలి

నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

జెమిలి ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనను కలిసి టిడిపి వారు చేస్తున్న అరాచకాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027వ సంవత్సరంలో జెమిని ఎన్నికలు తప్పక వస్తాయని ఇప్పటినుండి అందరూ సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ వారిని టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు.వెంకటగిరిలో తెలుగుదేశం వారి ఎత్తులు సాగలేదని తెలిపారు. తెలుగుదేశం పార్టీ వారి ఆగడాలు రోజురోజుకే ఎక్కువ ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, పార్టీ కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, నాయకులు దశరథ రామ్ రెడ్డి, సిపిఎల్ నరసింహారావు, కౌసులలో వహీదా, పూజా లక్ష్మి, కళ్యాణి, శ్రీనివాసులు రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం.. ఆర్థిక పురోగతికై సిఎం చంద్రబాబు కృషి

- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

మహిళల సంక్షేమం, ఆర్థిక పురోగతికై సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడ), రాజస్థాన్‌కు చెందిన ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థల ద్వారా కుప్పం మండలంలో ఎంపిక చేసిన మహిళలకు డిజిటల్ అక్షరాస్యతకు సంబంధించిన శిక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కుప్పంలో కడ నేతృత్వంలో ఓపక్క అలీప్ సంస్థ మరో పక్క ఫ్రంటైయర్ మార్కెట్స్ వారి సహకారంతో

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఫ్రంటైయర్ మార్కెట్స్ ద్వారా మహిళలకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించి వారి ద్వారా గ్రామాల్లో డిజిటల్ షాపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పంను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రముఖ సంస్థలను తాము సంప్రదించగా వారు కుప్పంకు వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఫ్రంటైయర్స్ మార్కెట్స్ సిఇఒ అజైతాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

కుప్పం నియోజకవర్గంలో 55శాతం ఉన్న అక్షరాస్యత శాతాన్ని సైతం పెంపొందించేలా చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమాల్లో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాం తారాం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, ఎపిఎం చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

కేవీబీ పురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

జాతీయ స్థాయి త్రోబాల్ ఆటల పోటీలకు రాయపేడు సర్పంచ్ పన్నూరు బాలాజీ తమ్ముడు భూషణం(సహాయక పశు వైద్యాధికారి) కుమార్తె లాస్య చరిష్మా దేశ స్థాయి త్రోబాల్ ఆటలు పోటీలకు ఎంపికైనట్లు శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ శరవణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాస్య చరిష్మా చదువుతో పాటు ఆటలపై కూడా మక్కువ కనబరచి జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపిక కావడంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. అలాగే లాస్య చరిష్మా తండ్రి భూషణం మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ఆటల పోటీల వేదికల్లో తన కుమార్తెను చూడాలన్నదే తన చిరకాల వాంఛ అని అన్నారు. ఇంతటి ప్రతిభ కనబరచిన లాస్య వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేషనతో పాటు, రాయపేడు గ్రామస్తులు అభినందించారు.

గ్రామాల్లో బాల్యవివాహాలపై అవగాహన

కేవీబీ పురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్స్ కాంపెయిన్‌లో భాగంగాప్రగతి సంస్థ కేవీబీ పురం మండలం కొండల ఆధారంలో బుధవారం బాల్య వివాహాలను అరికట్టాలని గ్రామస్తులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి.రమణ మాట్లాడుతూ బాల్య వివాహం అనేది ఒక సామాజిక దురాచారమని, సమాజంలో కొందరు మూడనమ్మకాల వల్ల ఎందరో యువతి, యువకులకు బాల్య వివాహాలు చేసివారి హక్కులను హరింప చేస్తున్నారని ఆయన మనోవేదాన్ని వ్యక్తం చేశారు. 18 సంవత్సరాల లోపు ఆడ పిల్లలకు, 21 సంవత్సరం లోపు మగ పిల్లలకు ఎటువంటి పరిస్థితుల్లో కూడా వివాహం చేయకూడదని ఒక వేళ అలంటి వివాహాలు జరిపిస్తే దానికి కారకులైనటువంటి యువతి, యువకుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు, ఆ వివాహానికి కావలసిన సౌకర్యాలను సమకూర్చినటువంటి ప్రతి ఒక్కరిపైన వివాహాన్ని జరిపించడానికి దోహదపడిన గుడిలోపురోహితులను, చర్చిలో పాస్టర్లను మసీదులో పైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ వర్కర్ మల్లికార్జున్, మధు కుమార్, లత, మండల కో-ఆర్డినేటర్ గిరీష్, గ్రామస్తులు గుణశేఖర్, కుమార్, రత్నం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్కాట్ సమాజానికి యువతకు చాలా ఉపయోగకరం

కేవీబీ పురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్ శిక్షణ శిబిరం కేవీబీ పురం మండలంలో ఏపీ మోడల్ స్కూలు కేజీబీవీ పాఠశాలలో బుధవారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, నోడల్ ఆఫీసర్ ఏఎంవో శివశంకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఈ సమాజానికి యువతకు చాలా ఉపయోగకరమని విద్యార్థి దశ నుంచి ఇలాంటి శిక్షణలో అభివృద్ధి పొందాలని ఆయన కోరారు. ఈ ఐదు రోజులు శిక్షణ ఏ విధంగా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంవో శివశంకరయ్య, అసిస్టెంట్ ఏఎంవో మధు, ఎంఈవో-2 రవికుమార్, మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, అల్లికల స్పెషల్ ఆఫీసర్ సిబ్బంది, ప్రిన్సిపాల్ సుకన్య, మురళీనాయుడు, కేజీబీవీ మోడల్ స్కూలు సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

విజయపురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

విజయపురం ప్రభుత్వ ఐటీఐలో ఆగస్టు 2025-2026 సంవత్సరానికి అడ్మిషన్ల కొరకు మొదటి విడతకు ఈ నెల 29 నుంచి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించబడుతుందని ప్రిన్సిపాల్ పి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకుని సంబంధిత ధృవపత్రాల నకలు కాపీలు జత చేసి 24 తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ వద్ద సమర్పించుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసిన విద్యార్థి మే 20,25,26 తేదీల్లో లోపు ఐటీఐ కార్యాలయంలో సర్టిఫికెట్‌వెరిఫికేషన్ చేసుకుని వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ చిత్తూరులో 2.6.2025 తేదీ నుంచి 10 వరకు ఇంటర్వ్యూకి హాజరు కాగలరని, ఎటువంటి ఇంటర్వ్యూ కార్డులు పంపబడవని తెలిపారు. ఇతర వివరాలకు 8639790174, 6303156450, 9494434236,9177035120 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నిబంధనలుపాటించండి

తిరుమల,ఏప్రిల్ 30ప్రభాతవార్తప్రతినిధి: సుదూర ప్రాంతాల నుండి వెంకన్న దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులను సేవాభావంతో డ్రైవర్లు గమ్య స్థానాలకు చేర్చాలని, నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, రవాణాశాఖ అధికారలు తెలిపారు.బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం దరకు తిరుమలలో నాలుగు బృందాలుగా విడిపోయి వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాలకు ఆర్‌సి, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపిన వారిని 24వాహనాలను సీజ్‌చేసి 1,22,560 రూపాయలు జరిమానా వసూలుచేశారు. తిరుమలకు ఘాట్‌లో వాహనాలను ప్రమాదరహితంగా నడపాలని, నిబంధనలు పాటించాలని తెలిపారు.

తిరుపతి డిఎస్పీ భక్తవత్సలంకు అభినందనలు

తిరుపతి నగరడిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన భక్తవత్సలంను రాయలసీమ రంగస్థలి నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గుండాల గోపీనాథరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య కలసి దుశ్శాలువతో సన్మానించారు.

ప్రభాతవార్త-తిరుపతి

లింగాయత ధర్మ వ్యవస్థాపకుడు బసవేశ్వరుడు

చౌడేపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త లింగాయత ధర్మ వ్యవస్థాపకుడు బసవేశ్వరుడని పలువురు కొనియాడారు. బసవ జయంతిని పురస్కరించుకొని స్థానిక మఠంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుల, మత, వర్గ విబేధాలకు 12వ శతకంలోనే పోరాడిన ధీరుడు బసవేశ్వరుడని కొనియాడారు. అన్నమయ్య, వీరబ్రహ్మేంద్రస్వామి, వేమనలాంటి వారి బావాల్లో విప్లవాత్మక మార్పులు రావడానికి పరోక్షంగా బసవుడే కారణమన్నారు. అలాంటి సంఘ సంస్కర్త జయంతిని జరుపుకోవడం శుభపరిణామమన్నారు. అనంతరం బసవన్న జీవిత చరిత్రను వివరించారు. వీరశైవలింగాయత్ జంగమ సేవా సంఘం నాయకులు ఠాణాదార్ నాగరాజ, డాక్టర్ శివకుమార్, బసవన్న, రాజన్న, మఠం రవి, మంజునాథ్, శివన్న, డాక్టర్ నాగరాజ, అశోక్‌కుమార్, ఆనంద, ఉమేష్, ఉమాదేవి, చంద్రమ్మ, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన వినియోగానికి విరాళాల వెల్లువ

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 30 ప్రభాతవార్త శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అన్నదాన వినియోగానికి దాతల నుంచి విరివిగా విరాళాలందినుట్లు ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. మదనపల్లికి చెందిన మురళీనాయుడు ఆయన సతీమణి గిరిలు రూ. 1.34.675 లు, వెంకటశివారెడ్డి, పంచరత్నమ్మలు రూ. 50వేలు, బెంగళూరు గంగప్ప రూ. 20వేలను అందించారన్నారు. దాతకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఆలయ అర్చక, అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బసవ జయంతి వేడుకలు

కుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త కుప్పం నియోజకవర్గంలో ఉన్న వీరశైవ లింగాయత్‌లు, జంగమ కులస్తులు బసవ జయంతిని కుప్పంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పట్టణంలో వివిధ రకాల వేషధారణలు, ప్రదర్శనలతో లింగాయత్‌లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీరశైవ లింగాయత్‌ల ఆరాధ్యదైవం బసవ జయంతిని ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉ ందన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, సంఘ సభ్యులు బసవరాజు, ప్రకాష్, వీరశేఖరయ్య, ప్రసన్న కుమార్, గిరిధర్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, వీరశైవ లింగాయత్‌లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్వీజీబిలో యథావిధిగా ఖాతాదారుల కార్యకలాపాలు

తవణంపల్లె, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుండి సప్తగిరి గ్రామీణ బ్యాంకు నేటి నుండి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారనుందని అరగొండ సప్తగిరి బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని సప్తగిరి గ్రామీణ బా ్యంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వంటి ప్రాంతీయ బ్యాంకులను విలీనం చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే నెల 1 నుండి ఈబ్యాంకుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్పాన్సర్ బ్యాంకుగా వ్యవహరిస్తుందని తెలిపారు. అయితే ఖాతాదారుల అకౌంట్ నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్రాంచి చిరునామాల్లో ఎటువంటి మార్పు లేదని, చెక్‌బుక్‌లు, ఏటిఎం కార్డులు,డిజిట్ సేవలను ఖాతాదారులు యథావిధిగా వినియోగించుకోవచ్చునని బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్ రెడ్డి తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేద్కర్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు గడించారని రాష్ట్ర మాల ఉద్యోగల సంఘ అధ్యక్షులు అశోక్‌బాబు అన్నారు. బుధవారం మహాసముద్రం గ్రామంలో 134వ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షులు అశోక్‌బాబు మాట్లాడుతూ రాజ్యంగ నిర్మాతగా అంబేద్కర్ పలు రచనలు చేపట్టారన్నారు. అణగారిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో పోరాట పటిమను సాగించారని గుర్తు చేశారు. అనాడు కుల వివక్షతో బడుగులు, అణగారిన వర్గాలుగా జీవనం సాగించారని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరు సమానంగా జీవించే హక్కు వుండాలనే లక్ష్యంగా అంబేద్కర్ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవులు, రాయలసీమ మాల మహానాడు అధ్యక్షులు సుదర్శన్, కార్యదర్శి ప్రభాకర్, జిల్లా ఎస్సీఓ అధ్యక్షులు రాఘవులు, మహాసముద్రం కృష్ణన్, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

కుప్పం నియోజకవర్గంలో మరో నాలుగు అన్న క్యాంటీన్లు

కుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం అయిన కుప్పంలో మరో నాలుగు అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇదివరకే కుప్పం పట్టణంలో అన్న కా ్యంటీన్ ఉండగా మండల కేంద్రాలైన శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం, మల్లానూరు పట్టణంలో మరో నాలుగు అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలోని అన్ని మండలాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేస్తామని ఇదివరకే ప్రకటించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. కొత్త అన్న క్యాంటీన్ల నిర్మాణాలకు ప్రభుత్వ ం టెండర్లు సైతం పిలిచింది. అతిత్వరలోనే అన్న క్యాంటీన్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాక వాటిని ప్రజలకు అందుబాటులో తీసుకురానున్నారు. కాగా ఇప్పటికే నిర్వహిస్తున్న అన్న క్యా ంటీన్లపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐదు రూపాయలకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రిపూట ఐదురూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. దీంతో ప్రజలు సిఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్

పుంగనూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరు పట్టణంలో పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ క్వార్టర్స్ పట్టుమని 30 ఏళ్లు కూడా మన లేకపోయాయి. పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న విశాలమైన ప్రాంతంలో ఈ క్వార్టర్స్‌ను 1990లో నిర్మించారు. పుంగనూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది మొత్తం కొన్ని దశాబ్దాల పాటు ఇదే క్వార్టర్స్‌లో ఉంటూ విధులు నిర్వహించారు. చాలామంది ఎస్ఐలు సిఐలు కూడా ఈ క్వార్టర్స్‌లో నివాసం ఉండి విధులకు హాజరయ్యేవారు. అయితే 2015 తర్వాత ఈ క్వార్టర్స్ నివాసయోగ్యం కాకపోవడం తరచూ మరమ్మతులు రావడంతో సిబ్బంది ఒక్కొక్కరే ఈ క్వార్టర్స్‌ను విడిపోవడం ప్రారంభించారు. కరోనా కంటే ముందే ఈ క్వార్టర్స్ పూర్తిగా శిథిలం కావడంతో వీటిని పట్టించుకోవడం మానేశారు. ఇప్పటికీ దృఢంగా ఉన్న ఈ క్వార్టర్స్ మరోసారి ఉపయోగం లోకి తీసుకురావడానికి మరమ్మతులు చేసి తీర్చిదిద్దాల్సి ఉంది. జిల్లా పోలీసు యంత్రాంగం ఈ క్వార్టర్స్ గురించి పూర్తిగా పట్టించుకోకపోవడంతో చిన్నచిన్న మరమ్మతులు ఉన్నప్పటికీ అవి పెద్దవై క్వార్టర్ సన్నిధిలో గృహాలుగా మారిపోయాయి. ఈ విశాలమైన స్థలంలో సీఐఎస్ఐ క్వార్టర్స్‌తో పాటు పోలీస్ విశ్రాంతి భవనాన్ని కూడా నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

సదుం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త మండల పరిధిలోని గిరిజనుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కే హరి శివప్ప అన్నారు. బుధవారం సదుం మండలం బట్టువారి పల్లె డిప్యూటీ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు జీవి రమణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజన కుటుంబాలు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగంలో ఎదగాలన్నారు. పిల్లలను కస్తూరిబా, గురుకుల, నవోదయ పాఠశాలలో చేర్చి విద్యాపరంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు గిరిజన కార్పొరేషన్ రుణాలను పొందాలన్నారు అదేవిధంగా గిరిజనులకు రావలసిన సబ్సిడీ రుణాలను ప్రభుత్వం గిరిజనులకు తప్ప ఇతరులకు అందజేయరాదన్నారు.చాలామంది బోగస్ సర్టిఫికెట్లతో తమకు రావలసిన ఉద్యోగాలను దక్కించుకొని ఉద్యోగాలు చేసుకుంటున్నారని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, కోశాధికారి హరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరావు, మహిళా మండలి కమిటీ సభ్యులు మేఘన, కళ్యాణి, వీరితోపాటు చిత్తూరు రవి, వెంకట్రావు, శంకర్, భాను ప్రకాష్, జానకిరామ్, రమణ బాబు, సుమతి, ఆనందయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక భూకాసురులకు పోలీసుల అండదండ

పూతలపట్టు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త పూతలపట్టు మండలం కొర్లగుంట గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణా కొనసాగిస్తున్న వేణు ఆచారి సంబంధించిన జెసిబి, ట్రాక్టర్లు ఇసుక రవాణా తరలిస్తుండడంతో పూతలపట్టు తాసిల్దార్ అక్రమ ఇసుక రవాణా అని అడ్డుకోవడంతో జేసిబిని పూతలపట్టు పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు. పూతలపట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ పట్టుబడిన జెసిబిని అదుపులోకి తీసుకోకుండా పార్టీ నాయకుల ఫోన్ కాల్ సమాచారంతో కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులు వత్తి అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్న వేణు ఆచారి జెసిబిని వదిలివేయడం పూతలపట్టు మండల ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నదన్నారు. బడుగు బలహీన వర్గాల కైనా సామాన్య ప్రజలు కైనా చట్టం ఒకే విధంగా పనిచేయాలని తప్పు చేస్తే ఎవరినైనా కఠినంగా శిక్షించాలని ఇలాంటి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులు దీనిపై స్పందించి ఇలాంటి సందర్భాల్లో పునరావతం కాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా పోలీసు యంత్రాంగం పై ఉందని పూతలపట్టు మండల ప్రజలు కోరుకుంటున్నారు.

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

పూతలపట్టు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిపై పి. కొత్తకోట మేజర్ గ్రామపంచాయతీ కలదు అందులో 30 పడగలను సామాజిక ఆసుపత్రి ఉన్నది ప్రయాణికులు వృద్ధులు, ఆసుపత్రికి వచ్చి పోయే రోగులు బస్సు షెల్టర్ లేక మండుటెండలో వేసవికాలంలో జాతీయ రహదారిపై నిరీక్షించడం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని పూతలపట్టు మండలం పాకాల మండలం నుంచి పి. కొత్తకోటకు వచ్చి ప్రయాణం చేస్తున్నవారు అనేకమంది ఉన్నారు. కావున జిల్లా కలెక్టర్ మరియు జాతీయ రహదారి వారు దీనిపై స్పందించి ప్రయాణికులు ఇక్కట్లను దృష్టిలో ఉంచుకుని బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాల్సిందిగా ప్రయాణికుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కోమల సేవలు అభినందనీయం

వెదురుకుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : డిప్యూటీ తహశీల్దార్ కోమల సేవలు అభినందనీయమని తహశీల్దార్ బాబు కొనియాడారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం డిటీ పదవీ విరమణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో బదిలీలు, పదవీ విరమణ సాధారణమని కాని బాధ్యతలు నిర్వహించిన కాలంలో వారు అందించిన సేవలు మాత్రమే చిరస్మరణీయమన్నారు. సహఉద్యోగులు, పెద్ద సంఖ్యలో ప్రజలు ఆమెకు దుశాలువ కలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, ఏఎస్‌వో చంద్రకళ, ఆర్ఐ లావణ్య, విఆర్‌వోలు హేమాద్రి,శాంభశివా రెడ్డి, హరికృష్ణ, ఈశ్వరయ్య, లోకనాథ రెడ్డి, ఎంపిడివో కార్యాలయ ఏవో నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

శాంతిపురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త మండలంలోని తుమ్మిశిలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో 2025సం॥లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. ఏడాది కాలం కోర్సులైన మెకానిక్ డీజిల్, వెల్డర్, రెండేళ్ల ట్రేడ్ అయిన డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్ కోర్సులు ఉన్నాయన్నారు. పదవ తరగతి పాస్ లేదా ఫెయిలైన విద్యార్థులు ఈనెల 24వతేది లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బాలికలకు సైతం ఈ కోర్సుల్లో ప్రవేశం ఉందన్నారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎందరికో ఆదర్శప్రాయుడు రామచంద్రయాదవ్

తిరుపతి,ఏప్రిల్ 30ప్రభాతవార్త: కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవారి పాదాలచెంత సేవాభావంతో, పదిమందికి సహాయం చేయడమే ఆయనలోని మంచి తనంగా విధులు నిర్వహించిన వి.రామచంద్ర యాదవ్ ఎందరికో ఆదర్శప్రాయుడని పలువురు టిటిడి ఉద్యోగులు, అధికారులు, విశ్రాంత ఉద్యోగులు కొనియాడారు. 1981లో ఉద్యోగిగా చేరి 1991లో రెగ్యులర్ అయ్యాడు. 1988లో వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్ కార్మికుల నేతగా ఎన్నికయయ్యాడు,. 44సంవత్సరాలు సుదీర్ఘంగా టిటిడిలో ఎలక్ట్రిక్ విభాగంలో చేరి పనిచేసిన ఆయన అంకితభావం,నిజాయితీ సేవలతో ఆదర్శంగా పదవీవిరమణ చేయడం జరిగిందన్నారు. అంతేగాక వందలాదిమందిని పలు విభాగాల్లో చేర్చి బ్రతుకుతెరువు చూపిన మహనీయుడు రామచంద్రయాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన పదవీవిరమణ సన్మాన సభ టిటిడి పరిపాలన భవనంలో వేడుకగా జరిగింది. ఆయన యూనియన్ నేతగా, బిసి ఉద్యోగులకు అండగా నిలబడి ఆయన చేసిన సేవలు, సహాయాన్ని ఉద్యోగులు పేరుపేరునా గుర్తుచేశారు. ఎందిరికో ఉద్యోగాలు కల్పించిన ఆయన ఆయనకే సాటిఅని కొనియాడారు. ఉద్యోగులందరితో కలసి మెలసి పనిచేయడం తన తత్త్వమని, ఇదీ తనకెంతో ఆనందం కలిగించి ఇంతమంది ఆత్మీయుల ఆశీస్సులు, అభినందనలు అందుకోవడం ఆనందంగా ఉందని రామచంద్రయాదవ్ అన్నారు పదవీవిరమణ సందర్భంగ

పిసిసి అధ్యక్షురాల గృహానిర్బంధం ఆప్రజాస్వామికం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త ఎపిసిసి చీఫ్ వైయస్ షర్మిలారెడ్డిని హౌస్ అరెస్టు చేయటం అప్రజాస్వామికం అని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఐ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి ఖండించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పిసిపి అధ్యక్షురాలి నివాసం వద్ద భారీ ఎత్తున పోలీసులు మోహరించి భయభ్రాంతుల్ని చేసారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఉద్దండరాయని పాలెం వద్దశంకుస్థాపన చేసారని అక్కడ షర్మిల పర్యటించాలని నిర్ణయించటంతో అనుమతించక పోగా గృహానిర్బందం చేయటం దారుణమన్నారు.అమరావతి రాజధానిలో ఏం జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. అక్కడ ఏం జరుగుతుందో ఏం చేస్తున్నారో? ఏం చేయబోతున్నారో? ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రతిపక్షాలను గృహానిర్బంధం కలుగజేసి ప్రజలను ఆయోమయంలో పడేయటం తగదన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎల్ల వేళల్లో ప్రజలపక్షాన ఉంటుందని దామోదర్‌రెడ్డి అన్నారు.

ఈశ్వరయ్యకాలనీలో సివిల్‌రైట్స్‌డే

శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీలోని ఈశ్వరయ్య గిరిజనకాలనీలో శ్రీకాళహస్తి డివైయస్‌పి కె.నరసింహామూర్తి సారధ్యంలో సివిల్ రైట్స్‌డేను నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజుఆదేశాలతో శ్రీకాళహస్తి సబ్‌డివిజన్‌లోని పలు గ్రామాల్లో పోలీసులు పల్లె నిద్ర నిర్వహిస్తూ పల్లె ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నరసింహామూర్తి మాట్లాడుతూ పోలీసు చట్టాలకు సంబంధించి ప్రతి ఒక్కపౌరుడు తెలుసుకోవాలన్నారు. పోలీసులుకూడా మనుషులే అన్నారు.నూతనచట్టాలకు సంబంధించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. తమ బిడ్డలకు విద్యను అందించుటకు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్యను అందిస్తున్నారని ఈ ఏడాది పది పరిక్షల్లో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు తమ సత్తా చూపారన్నారు.ఈకార్యక్రమాల్లో ఎంపిడిఓ ఎండి రఫీఖాన్, శ్రీకాళహస్తి రూరల్ సిఐ ఎం.రవినాయక్ శ్రీకాళహస్తి తహశీల్దార్,ఎంపేడు పంచాయతీ కార్యదర్శి విఆర్ఓ మాజీ ఎఎంసి చైర్మెన్ తాడిపర్తి ఈశ్వరరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అడవులకు నిప్పు పెట్టి పర్యావరణానికి హాని కల్పించవద్దు



శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త అడవులకు నిప్పు పెట్టి పర్యావరణానికి ముప్పు కల్గిస్తున్నారని అడవి జంతువుల ప్రాణాలకు హాని కల్పిస్తున్నారని కృష్ణాపురం డిఆర్ఓ సికిందర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏర్పేడు మండలంలోని అడవులను కొందరు నిప్పు పెట్టి పబ్బం గడుపుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. మండలంలోని శేషాచలం అడువులలో పశువుల కాపరులు గొర్రెల కాపరులు మూఢనమ్మకాలతో అడవికి నిప్పు పెట్టుతుండటం భాధాకరమన్నారు. శేషా చలం అడవులలో పెట్టె నిప్పులను తమ సిబ్బందితో కలసి మంటలను అదుపు చేయటానికి శ్రమించాల్సి వస్తుందన్నారు. ఇటీవల అడవులలో పడిన నిప్పులను అర్పడానికి వన సంరక్షణ సమితి సభ్యులతో కలసి తమ సిబ్బంది రాత్రి వేళల్లో సైతనం మంటలను అదుపు చేయటానికి ఇబ్బంది పడుతున్నారని వివరించారు.మంగళవారం రాత్రి కూడా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అడవులకునిప్పు పెట్టి పలానం చిత్తగించారన్నారు. వాటిని ఆర్పటానికి బీట్ అధికారులు పురుషోత్తం, శోభారాణి,ప్లాట్ వాచర్ పొన్నారెడ్డి 15 మంది వన సంరక్షణ సమితి సభ్యులు విశేషంగా కృషి చేసారన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించడానికి మొక్కలు నాటండి..!

రామచంద్రాపురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అవసరమని చిత్తూరు డిఎఫ్ఓ భరణి ఐఎఫ్ఎస్ అన్నారు. బుధవారం కొత్తకండ్రిగ సమీపంలో గల అటవీ ప్రాంతాన్ని పచ్చదనంగా మార్చేందుకు ప్రాణయోగ ఆశ్రమం వ్యవస్థాపకులు కైలాష్ గురూజీ చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెకు కైలాష్ గురూజీ కుమార్తె కృపాకామాక్షి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అడవుల సంరక్షణతో మానవ మనుగడ సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించవచ్చన్నారు. బయోట్రీమ్ సిఈఓ నరేంద్రన్ ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ ప్రాణయోగ ఆశ్రమం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం ఎంతో గొప్పదని కొనియాడారు. సుమారు 250 మర్రి, వేప, రావి, తదితర మొక్కలను నాటి సంరక్షించడం ఎంతో కష్టతరమన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టిన ఆశ్రమ నిర్వహకులకు అభినందనలు తెలిపారు. ఎఫ్ఆర్ఓ వెంకట సుబ్బయ్య, డిఆర్ఓకరణ్‌సింగ్, ఎఫ్‌బిఓ కుమార్, సిబ్బంది పద్మనాభం, ప్రాణయోగ ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

చంద్రగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: చంద్రగిరి బైపాస్, పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టు కోవడంతో సంతోష్ కుమార్‌రెడ్డి, యశ్వంత్ ఇద్దరు గాయాలపాలయ్యారు. ఇందులో చంద్రగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన సంతోష్ కుమార్ రెడ్డి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రగిరి నుండి భార్య పిల్లలను బెంగుళూరుకు తీసుకెళ్ళే క్రమంలో వారిని బస్సులో ఎక్కించి తాను ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న యశ్వంత్ వాహనం రెండూ ఢీకొట్టుకోవడంతో సంతోష్ తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించగా సంతోష్ చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గణితం అంటే భయమేందుకు అబాకస్ ఉండగా...

తిరుపతిరూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: గణితం అంటే విద్యార్థులలో ఓవిధమైన భయం నెలకుని ఉంటుందని, ఆ భయాన్ని అబాకస్ ద్వారా తొలగించవచ్చునని ఆర్కే అబాకస్ నిర్వాహకులు తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎంతటి క్లిష్టమైన గణిత సమస్యలైన అబాకస్ నేర్చుకోవడం ద్వారా సులభతరంగా పరిష్కరిస్తారని తెలిపారు. డాక్టర్ ఆర్కే రెడ్డి, ఆర్కే విమల ఆధ్వర్యంలో గత 13సంవత్సరాలుగా కొన్నివేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి గణితంలో అసాధరణమైన అద్భుతాలు సృష్టించినట్లు తెలిపారు. క్రీస్తుపూర్వమే ఈ విధానం అమలులో ఉండేదని, అప్పట్లో గణిత సమస్యలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రేమో పూజలను ఉంచి, లెక్కించి, చిటికలో పరిష్కరించేవారని తెలిపారు. గణిత మేధావులైన ఆర్యభట్ట, శ్రీనివాస్ రామానుజన్, శకుంతలదేవి లాంటి వాళ్ళు ఇలాంటి పద్ధతులను ఉపయోగించి సులవుగా గణిత సమస్యలు పరిష్కరించేవారని తెలిపారు. ఆర్కే అబాకస్ నిర్వాహకులు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాధారణంగా ఎక్కువశాతం మంది అన్ని సబ్జెక్టులలో కెల్లా గణితంలో వెనకంజలో ఉంటారని గణితం అంటే విద్యార్థులలో ఓ విధమైన పోభియా అని, అది గుర్తించి సరైన పద్ధతిలో అభ్యసిస్తే, గణితం సులభతరమని తెలిపారు. వేసవి అబాకస్ శిక్షణాతరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. వివరాలకు 9989500074 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

తిరుపతి విద్య ఏప్రిల్ 30 ప్రభాత వార్త భగభగ మండుతున్న ఎండలకు గొంతులో కాసిన్ని మంచినీళ్లు పడితే ప్రాణం కాస్త కుదుటపడు తుంది.మరి చల్లని మజ్జిగ తాగితే మరింత ఉపశమనం కలుగుతుందని భావించిన ఎల్ఐసి బ్రాంచ్ టు సిబ్బంది అక్షయ తృతీయ సందర్భంగా స్థానిక కరకంబాడి రోడ్డులో నగరవాసులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.సుమారుగా 1000 మజ్జిగ ప్యాకెట్స్ ను పంచడం జరిగింది ఎల్ఐసి బ్రాంచ్ టు సిబ్బంది కే.వి విద్యావతి,మల్లిక పాల్గొన్నారు.

ఇస్కఫ్ నూతన జిల్లా అధ్యక్షులుగా డి.రామచంద్రయ్య.

తిరుపతి విద్య ఏప్రిల్ 30 ప్రభాత వార్త

స్తానిక గాంధీ రోడ్డు నందుగల విశాలాంధ్ర బుక్ హౌస్ నందు తిరుపతి జిల్లా ఇస్కఫ్ సమావేశము డి రామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశమునకు ముఖ్య అతిధిగా ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగ శ్రీధర్ హాజరై 500 మెంబర్షిప్ చేర్పించాలని మైత్రి బుక్కును అందురు చదవాలని పర్యావరణఎ ´రిరక్షణ శాంతి సామరస్యం సామాజిక జీవనఅభివృద్ధికికృషి చేస్తూ అలజడులు ఆందోళనలు యుద్దాలు లేకుండా ప్రశాంతంగా ప్రజలు అందురు ఉండడానికి చైతన్యం కల్పించాలని ఉగ్రవాదులు కు మతోన్మాదులకు వ్యతిరేకంగాఉద్యమించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా డి రామ చంద్ర య్య, ఉపాధ్యక్షులుగా ఎం గిరిధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్లపూడి గోవిందస్వామి,సహాయ కార్యదర్శిగా చిన్నంకాళయ్య,బుసగాని లక్ష్మయ్య, కోశాధికారిగా అల్లాబక్షు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నలుగురినిఎన్నుకోవడంజరిగినది.ఈకార్యవర్గాన్నిఏకగ్రీవంగా మెంబర్లు అందరూ ఆమోదించడం జరిగింది.

అప్పుల బాధతో సెంట్రింగ్ కూలీ ఆత్మహత్య

కేవీబీ పురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: అప్పుల బాధ భరించలేక సెంట్రింగ్ కూలీ మారేళ్ళ వెంకటయ్య(27) ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేవీబీ పురం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు... కేవీబీ పురం దళితవాడకు చెందిన మారేళ్ళ వెంకటయ్య సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. వాయిదా పద్ధతిలో(ఫైనాన్స్ పై) 5 లక్షలు అప్పు చేయడంతో వాయిదా చీటీ యాజమాన్యం రోజు ఇంటి వద్దకు వచ్చి అసభ్య పదజాలంతో తిట్టడంతో మనస్థాపం చెంది గడ్డికి పిచికారి చేసే పురుగులు మదు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అమరావతి పునఃనిర్మాణానికి అందరు ఆహ్వానితులే-రాష్ట్ర అధికార ప్రతినిధి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

అమరావతి రాజధాని పనులు పునర్నిర్మాణంపై రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి పాత్రి కేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల రాజధాని అయిన ప్రజారాజధాని మన అందరి రాజధాని. అమరావతి పనుల పునర్నిర్మాణ కార్యక్రమానికి అమరావతి సృష్టికర్త నారాచంద్రబాబునాయుడు సారధ్యంలో రేపు ప్రారంభించడం శుభపరిణామమని ఇందుకు ప్రధాని నరేంద్రమోడీ రావడం హర్షణీయం అన్నారు. సమావేశంలో అధికార ప్రతిధి రాఘవులుయాదవ్, మునిరాజయాదవ్, మండల బిసి అధ్యక్షులు మునెయ్య, ఎస్సీ సెల్ నాయకులు దారా పాండు, పార్టీ బిసి నాయకులు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ పద్మవిభూషన్ అవార్డును పొందడం పట్ల సంబరాలు

నారాయణవనం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటులు నందమూరి బాలకృష్ణకు పద్మవిభూషన్ అవార్డును ఇవ్వడం పట్ల నారాయణవనం బాలకృష్ణ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం రాత్రి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు కెఎస్ రవి, సుబ్రమణ్యం, రమేష్, లక్ష్మీపతి, శరవణరెడ్డి, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అంకురార్పణతో ప్రారంభమైన అగస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం సాయంత్రం గణపతిపూజ, అంకురార్పరణ ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి,అమ్మవార్లను తిరుచ్చావాహనంపై అదిరోహించి పురవీధుల్లో ఊరేగించారు. స్వామి, అమ్మవారి ఊరేగింపు సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాకారులు కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు అడుగ డుగునా టెంకాయహరతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. టిటిడి అధికారులు భక్తులకు ప్రసాదాలను అందించారు.

రేణిగుంట అర్బన్ సీఐగా జయచంద్ర

రేణిగుంట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

రేణిగుంట అర్బన్ సీఐగా జయచంద్ర బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న శరత్ చంద్ర తిరుపతికి బదిలీ అయ్యారు. వైయస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు చెందిన జయచంద్ర 2009లో వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధుల్లో చేరారు. 2024 సంవత్సరం నంద్యాల జిల్లా కోయిలకుంట్లకు పదోన్నతి పొంది సీఐగా వెళ్లారు. అక్కడనుండి ఎన్నికల అనంతరం తిరుపతి జిల్లా ఏర్పేడు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందిన ఆయన తాజాగా రేణిగుంట అర్బన్ సీఐగా పదవి బాధ్యతలు చేపట్టారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన కష్టపడి చదివి ప్రజాసేవ చేయాలను ఉద్దేశంతో పోలీసు శాఖలో చేరానన్నారు. ఆయనకు అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, స్టేషన్ రైటర్ గౌరీ నాయుడు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

ఘనంగా శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ వార్షికోత్సవం

తిరుపతి విద్య ఏప్రిల్ 30 ప్రభాత వార్త శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హై స్కూల్ (న్యూ జన్ క్యాంపస్) 48వ వార్షికోత్సవం రాగ్ రంగ్ 2025" పేరుతో తిరుపతి మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ స్కూల్ చైర్మన్ కె ఎస్ వాసు మాట్లాడుతూ స్కూల్ డే అనే పదాన్నే పూర్తిగా మర్చిపోయి కేవలం ఎడ్యుకేషన్..ఎడ్యుకేషన్ అనే పంథాలో కాకుండ కేవలం ఎడ్యుకేషన్ మాత్రమే వుంటే సరిపోదు,పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడం,వారిలోని సామర్థ్యమును వారే గుర్తించగలిగేలా,దాదాపు 1500 మంది విద్యార్థులలో వున్న ప్రతిభా పాటవాలను 20 కల్చరల్ ఐటమ్స్ లో చూపించడమే రాగ్ రంగ్-2025 ప్రత్యేకత. నర్సరీ,ఎల్.కే.జి, యు.కే.జి.చిన్నారుల కోసమే ప్రత్యేకంగా కాన్వకేషన్ డేని నిర్వహించడం శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ వారికే సాధ్యమన్నారు.చదువుతో పాటు బహుముఖ ప్రతిభచాటే విధంగా, పిల్లలను మన సంస్క్ృతీ,సంప్రదాయాలు,సృజనాత్మకత మేళవించి ఒత్తిడి రహిత వాతావరణంలో నడిపిస్తూ ప్రతి పిల్లవాడు ఎంతో ఆశక్తితో పాఠశాలకు వచ్చేవిధంగా చేయడమే తమ పాఠశాల ధ్యేయమని అందుకే ఈ వార్షికోత్సవం నిర్వహిస్తామని పాఠశాల చైర్మన్ కె.యస్.వాసు వివరించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్.యం.పి. సప్నాలత,ప్రైమరి ఇన్ చార్జ్ బి.కవితశ్రీ,కిండర్ గార్డెన్ ఇన్ చార్జ్ సి.భువనేశ్వరి, ఉపాధ్యా యులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్ఏపి అమలులో అధ్యాపకులదే కీలకపాత్ర

తిరుపతి విద్య, ఏప్రిల్ 30 ప్రభాత వార్త

నూతన విద్యావిధానం అమలులో అధ్యాపకులదే కీలక పాత్ర అని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్లిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎమ్) జాతీయ సహ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్ పేర్కొన్నారు.బుధవారం జాతీయ సంస్క్ృత వర్సిటలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైవీరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న నూతన జాతీయ విద్యా విధానం సరైన మార్గంలో అమలుపరిచినట్లయితే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు,నైపుణ్యాలు,శిక్షణ,పరిశోధనలు పెరుగుపడతాయన్నారు.దీంతో మన వర్సిటీలో ప్రపంచ విశ్వ విద్యాలయాలతో పోటీపడే విధంగా మార్గదర్శనం చేయవచ్చని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ఢిల్లీ వేధికగా ప్రధానమంత్రి మోడీ దేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలతో చర్చించారన్నారు. భారతదేశ విద్యా రంగంలో సవాళ్లు, మార్పులు అనే అంశం పై జూలై 26,27 చెన్నైలో ఏబిఆర్ఎస్ఎమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ప్రముఖ విద్యావేత్తలు,వీసీలు, 1000 మంది అధ్యాపకులు పాల్గొంటారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ బుల్టిదాస్,డాక్టర్ బాలసుబ్రమణ్యం, ప్రతినిధులు డాక్టర్ రమేష్,డాక్టర్ చందూలాల్,డాక్టర్ శ్రీ లేఖ,డాక్టర్ కుమార్, డాక్టర్ సంధ్య,డాక్టర్ వివేక్,డాక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

శివయ్య సేవలో ఛత్రపతి శివాజి మనవడు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఛత్రపతి శివాజి మనవడు సంభాజిరాజే ఛత్రపతి పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహాచరులు ఘనస్వాగతం పలికారు. బుధవారం సంభాజిసిరాజే ఛత్రపతి రాగా ఆయన ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు,అభిషేకాలు జరిపించుకోవాలని కోరారు.దాంతో వెంటనే ఆలయాధికారులు ఏర్పాట్లు చేసారు. వేదపండితులు వేద మంత్రాలతో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించగా ఆలయంలోని నిర్మాణాన్ని ఇక్కడ ప్రాశస్త్యాన్ని మధుసూధనరెడ్డి వివరించారు. ఆకాశ వినాయకుడు అలాగే ఆలయ ఆవరణలోని ఆకాశనంది,కోట మండపం ప్రాధాన్యతలను వివరించారు.పూజలు,అభిషేకాల తరువాత వారికి ప్రత్యేక ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో మధుసూధనరెడ్డితో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,సూరా సురేష్, మైనారిటి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్‌ఖాన్ తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మెన్ సిరాజ్‌బాషామాజీ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్ అస్లాంబాషా, జివికే రెడ్డి, జైకృష్ణారెడ్డి కార్తీక్ యాదవ్, రవి,సతీష్, సూర్య, యాకూబ్,సాయి తదితరులున్నారు. ఆయనకు వినాయక దారు శిల్పాన్ని అందించారు

ఖాదీ పరిశ్రమకు చేయూత ఇస్తాం:గ్రామీణ పరిశ్రమలకు ప్రాణం పోస్తాం

కార్పొరేషన్ చైర్మెన్ చౌదరి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయా నికి బుధవారం రాష్ట్ర ఖాదీ మరియు విలేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మెన్ కె కె. చౌదరి కుటుంబసభ్యులతో వచ్చారు.వారికి దర్శనం ఏర్పాట్లును తెలుగుదేశం పార్టీ నాయకుడు బాలాజి వారి సహచరులు ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం చౌదరి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ పదవులు కేవలం అలంకారానికే పరిమితమయ్యాయన్నారు. అయితే ప్రస్తుతం తెలుగుదేశం నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్పొరేషన్లకు జవసత్తాలు పెంచుటకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలు,గృహ పరిశ్రమలకు తగిన గుర్తింపు లేక ఖాయిలా పడుతున్నాయన్నారు. ఈ సారి కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృసి చేస్తున్నామన్నారు. గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించటమే కాకుండా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే అంశం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలిస్తున్నారన్నారు. చౌదరికి స్వాగతం చెప్పిన వారిలో బాలాజిరెడ్డి, సుబ్బయ్య, ఖాదర్ తదితరులున్నారు.

తొండవాడలో 9 పొట్టేళ్ళు చోరీ..!

చంద్రగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: తొండవాడలో 9 పొట్టేళ్ళు చోరీకి గురైనట్లు తెలిసింది. గ్రామ శివార్లలో మురళి యాదవ్ మేకల కాపరి ఎప్పటి వలే కాపల వుండగా మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఎవరో వస్తున్నట్లు చప్పుడు రావడంతో ఉలిక్కిపడి లేచాడు. గుర్తు తెలియని దొంగలు తమ మేకలు, గొర్రెలు, పొట్టేళ్ళను పట్టుకుపోయేందుకు (చోరీకి) వచ్చినట్లు గ్రహించి అడ్డుకునే చేశాడు. దీంతో దుండగులు కాపరి కళ్ళల్లో కారంకొట్టి కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో 9 పొట్టేళ్ళను (జీవాలను) కాళ్ళుకట్టేసి ఎత్తుకుపోయినట్లు బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసు విచారణ చేపట్టారు.

తిరుపతి డివిజన్

డిపిటిఓ నరసింహులు సేవలు ఆదర్శం

తిరుపతి(రవాణ),ఏప్రిల్ 30ప్రభాతవార్త ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడంలో తనవంతుగా కృషి చేసి అటు ఉద్యోగులు ఇటు సిబ్బందిలో కార్మికుడుగా పనిచేసిన తిరుపతి జిల్లా ప్రజారవాణాఅధికారి జి.నరసింహులు సేవలు ఆదర్శమని పలువురు వక్తలు తెలిపారు. తిరుపతి డిపిటిఓగా పదవీవిరమణ చేసిన ఆయనను బుధవారం సాయంత్రం తిరుపతి ప్రాంతీయ కార్యాలయంలో ఆర్టీసి అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. 1992లో ట్రైనీ ఆఫీసరుగా ఆర్టీసిలో చేరిన ఆయన డిపో మేనేజరుగా, డివిజనల్ మేనేజరూ, వర్క్షు మేనేజరుగా,. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా, డిప్యూటీ సిఎంఇగా, తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారిగా మెరుగైన సేవలందించారన్నారు. వివిధ హోదాల్లో 33సంవత్సరాలు నిజాయితీగా సేవలందించారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ ఆర్. ఫహాజాద్, అకౌంట్స్ ఆఫీసర్ ఎం.చంద్రమణి, డిప్యూటీ సిటిఎం పి.విశ్వనాథ్, తిరుపతి డిఎం బాలాజీ, జిల్లాలోని డిపో మేనేజర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు

అభ్యుదయవాది శ్రీశ్రీ

తిరుపతి(రవాణ),ఏప్రిల్ 30ప్రభాతవార్త విప్లవ రచయిగా,అభ్యుదయవాదిగా తెలుగు సాహిత్యానికి దశదిశను మార్చిన రచయితల్లో శ్రీశ్రీ ఒకరని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. శ్రీశ్రీ 115వ జయంతి వేడుకలను బుధవారం ఉదయం తిరుపతిలోని రాయలసీమ రంగస్థలి కళాకారులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం కవితా సంకలనం ఇప్పటికీ ఎవర్‌గ్రీన్ పుస్తకం అని కొనాయాడారు. అతి తక్కువ అక్షరాలతో మహాశబ్దాన్ని సృష్టించగల దిట్ట శ్రీశ

గూడూరు డివిజన్

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

చిల్లకూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండలం తొణుకుమాల గ్రామానికి చెందిన షేక్ అమీర్ అనే వ్యక్తి మూడు రోజుల క్రితం ముత్తుకూరు మండలం బావితోపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలవ్వడంతో స్థానికులు అతన్ని నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. హాస్పిటల్ వైద్యులు బ్రెయిన్‌కు వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో వారు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడును సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన ట్రస్ట్ సభ్యుడైన బాబు ద్వారా 20వేల రూపాయలను హాస్పిటల్‌కి వెళ్లి అమీర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పేదవారికి సాయం అందించేందుకు మా ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని, అమీర్ కుటుంబానికి ట్రస్టు తరుపున సహాయ, సహకారాలు అందించడం జరుగుతుందని తెలియజేశారు.

ప్రశాంతంగా పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష

గూడూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష జరిగింది. పట్టణంలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ఎస్.కె.ఆర్, ప్రభుత్వ పాలిటెక్నిక్, డి.ఆర్. డబ్ల్యూ కళాశాలతో పాటు జడ్పీ బాలుర పాఠశాల, జడ్పీ బాలికల పాఠశాల కేంద్రాల్లో పరీక్ష జరిగింది. ఐదు కేంద్రాల్లో 1221 మంది విద్యార్థులకుగాను 1037 మంది విద్యార్థులు హాజరైనారు. అందులో బాలురు 652, బాలికలు 385 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవికృష్ణ తెలిపారు.

ఆర్ఎంఓ రవికుమార్ సేవలు ప్రశంసనీయం

గూడూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఆర్ఎంఓ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్ వి రవికుమార్ పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం గూడూరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పటల్ సూపర్నెంట్ డాక్టర్ షారీనా మాట్లాడుతూ హాస్పటల్ అభివృద్ధికి ఆర్ఎంఓ డాక్టర్ ఆర్వి రవికుమార్ మంచిగా విధులు నిర్వహించారన్నారు. అనంతరం రవికుమార్ దంపతులను హాస్పటల్ సిబ్బంది ఘనంగా పూలమాల శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు అల్పాహారం పంపిణీ

గూడూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో 150 మంది నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పదకొండేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చలివేంద్రాల నిర్వహణ, విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ, నిరుపేదలకు దుస్తులు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్, దగ్గోలు సురేంద్రబాబు, కె.శ్రీనివాసన్, షేక్ నాయకుల ఫయాజ్, ఎండి.గౌస్, అడ్వకేట్ ఖాషిఫ్, ఎండి ఖీజర్‌సయ్యద్ నియామతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసును కొట్టేసిన నెల్లూరు రైల్వే కోర్టు

గూడూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వంలో ఉన్న నరేంద్ర మోడీ ఈ రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేయడంతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన భారత్ బంద్‌లో ప్రజా సంఘ నాయకుల పైన పెట్టిన అక్రమ కేసులకు భయపడేది లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరులోని రైల్వే కోర్టులో కేసు నెంబర్ 370/2021 మీద పెట్టిన కేసు గత 4 సంవత్సరాలు క్రితం తిరుపతి రైల్వే పోలీసులు పెట్టిన కేసుపై వాయిదాలుతో నాలుగు సంవత్సరాలు గడచిన తర్వాత సరైన సాక్షాధారాలు లేనందువల్ల జడ్జి గారు కేసును కొట్టేస్తున్నట్టు ప్రకటించారు. మే నెల రెండవ తేదీన అమరావతి కోస్తున్న నరేంద్ర మోడీకి సీపీఐ సూటి ప్రశ్న ప్రధానమంత్రి మోడీకి చిత్తశుద్ధి ఉంటే అమరావతి నిర్మాణంతో పాటు ప్రత్యేక హోదా ప్రకటించి తీరాలని లేకుంటే ప్రజా ఉద్యమాలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్ బాబు పాల్గొన్నారు.

తడకండ్రిగలో రోడ్లు వేయండి సారూ..!

తడ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండలం తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బోడిలింగాలపాడు బిసి కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబిసి ఛైర్మన్ భాస్కర్ యాదవ్, మండల ఓబిసి ఛైర్మన్ నిత్యానందం బుధవారం ఎంపిడిఓ ఎన్.విజయకుమార్‌ను కోరారు. తడ బజారు, కోనేటిమిట్ట బిసి కాలనీలలోను, రైల్వే క్వార్టర్స్ రోడ్డు వద్ద కూడా సిమెంటు రోడ్డు అవసరాన్ని వారు ఎంపిడిఓకు ఇచ్చిన అర్జీలో పేర్కొన్నారు.

ఉత్సవంలో జరిగిన దుర్ఘటన బాధాకరం : కంకణాల

గూడూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :రాష్ట్రంలో కడప జిల్లాలో వున్న రాయచోటిలో వీరభద్ర స్వామి ఉత్సవం జరుగుతున్నప్పుడు కొంతమంది ముస్లిం సోదరులు రాళ్లు వెయడాన్ని, అక్కడ నివసిస్తున్న ముస్లిం మత పెద్దలు ఈ దుర్ఘటనను ఎందుకు ఖండించలేకపోవడం మాకు చాలా బాధాకరంగా ఉందని భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు పేర్కొన్నారు. భారతదేశంలో వున్న ప్రతి ఒక్కరూ భారత్ మాతాకి జై అనే నినాదం చేయాలన్నారు.

క్రిసిటీ పనులు పరిశీలించిన జేసీ

కోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలో జరుగుతున్న క్రిసిటీ పనులను బుధవారం జాయింట్ కలెక్టర్ శుబంభన్సల్ పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, రోడ్లు వంటి పనులు వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

కోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించు కోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోట మండల డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్ కోరారు. బుధవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని చెందోడు గ్రామంలోని నీలగిరి కాలనీలో గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం రూపొందించిన ప్రాథమిక హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు, వాటి ఆవిశ్యకత గురించి వివిధ శాఖల అధికారులు వివరించారు.

క్షేత్రస్థాయి నుంచి వైఎస్ఆర్‌సిపి బలోపేతం చేయాలి

- అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్

వెంకటగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మాజీ రాష్ట్ర విద్య వసతుల మౌలిక సంస్థ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో నియోజకవర్గస్థాయి పార్టీ కార్యకర్తలు నాయకులు కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ 2.0లో అధికారంలోకి వచ్చాక కార్యకర్తల కోసం ఎలా పనిచేస్తా చేస్తారు చూపిస్తారని తెలిపారు. కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేయడంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిపై మాజీ సీఎంకి ఉన్న నమ్మకం కారణంగానే వెంకటగిరిని ఎంపిక చేశారని తెలిపారు. ఇటీవల మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం వీగిపోయి వైఎస్ఆర్‌సిపి జయకేతనం ఎగురవేయడం రాష్ట్రంలోని వెంకటగిరికి గుర్తింపు తెచ్చిందన్నారు.

మూడురోజులుగా నీటి సరఫరా బంద్

కోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండల పరిధిలోని మద్దాలి, మద్దాలికండ్రిగ గ్రామాల్లో గత మూడురోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఆ రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రెండు గ్రామాల ప్రజలు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచి వ్యవసాయ బోర్లు ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని సర్పంచ్ వాణి ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు జిల్లా కలెక్టర్ మంచినీటి ఎద్దడి రాకుండా చూడాలని గ్రామాల ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఇక్కడ మాత్రం విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ కోట సబ్ డివిజన్ ఏడీ చిన్నయ్యను 'ప్రభాతవార్త' వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పంపించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

బ్రహ్మోత్సవాల్లో తమిళ, తెలుగువారి సాంప్రదాయాలు

తడ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండలం వాటంబేడు కుప్పంలో జరుగుతున్న శ్రీధర్మరాజస్వామి బ్రహోత్సవాలను తెలుగు, తమిళ సాంప్రదాయాలతో నిర్వహిస్తున్నారు. ఇక్కడ పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా రెండు రాష్ట్రాల కళాకారులచే నిర్వహిస్తున్నారు. తడ పోలీసులు ప్రతి సాయంత్రం బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం భారతంలోని కామధేను పర్వం, గంధర్వ పర్వంలను పఠనం చేశారు. అనంతరం గరుడ సేవ, గ్రామోత్సవాలు నిర్వహించారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

తడ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండల పరిధిలోని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు ఎంపిడిఓ ఎన్.విజయకుమార్ తెలిపారు. మండల పరిధిలో మొత్తం 5,862 పింఛన్ల పంపిణీకి గాను రూ.2 కోట్ల 51 లక్షల 28వేల 500 రూపాయలు విడుదలైనట్లు ఆయన తెలిపారు. బుధవారం ఈ మొత్తాన్ని సచివాలయాల సిబ్బంది డ్రా చేశారని, గురువారం ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

సంఘం సమావేశానికి ఈవోకు ఆహ్వానం

వెంకటగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాలుగవ సర్వసభ్య సమావేశం గుంటూరులో నిర్వహిస్తున్నామని ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకావాలని టీటీడీ ఈవో శ్యామలరావును ఉద్యోగ సంఘాల నాయకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ నాగేశ్వరరావు, తిరుపతి రీజియన్ అధ్యక్షులు శ్రీరామ పరంధామయ్య, అడిగోపుల సుబ్బరాయుడు, గొట్టిముక్కల రామచంద్రయ్య, అవ్వారు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చవటగుంట అలరించిన అర్జున తపస్సు

వెదురుకుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండలంలోని చవటగుంట మహాభారత వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సు వద్దకు అర్జున వేషాదారి, పరమశివుని వేషాదారి చేరుకుని యుద్ధం చేయడం జరుగుతుందని, అర్జునుని ప్రతిభ పాటవాలకు మెచ్చి పరమశివుడు పాశుపదాస్త్రం అందించే కార్యక్రమంను కన్నులకు కట్టున్నట్లు ప్రదర్శించారు. అనంతరం అర్జున వేషాధారి మెట్టుకు పాటలు పాడుతూ తపస్సు అధిరోహించి, తన వెంట తీసుకువెళ్ళిన వీబుధిపండ్లు, నిమ్మపండ్లు భక్తుల పైకి విసరడంతో వాటికి భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంకు ఉభయ దాతలుగా మారేపల్లెకు చెందిన లక్ష్మీరాయల్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి, ముఖ్య కార్యనిర్వహకులు ఆంజనేయులురెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, ఉమాపతిరెడ్డి, నరసింహారెడ్డి, జయరాం, హరినాథ రెడ్డి. మోహన్ రెడ్డి,రామయ్య, ప్రకాష్,ఆనంద రెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు పోలీస్‌స్టేషన్‌ని జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: పుత్తూరు పోలీస్‌స్టేషన్‌ని ఆకస్మికంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేసి సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం బదిలీలు చేసినటువంటి వాళ్ళందరూ రిపోర్టు చేశారా... లేదా....అని డీఎస్పీని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని ఓపెన్ భూజింగ్, బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రం చేయడం, పీజీఆర్ఎస్, పల్లెనిద్ర వంటి కార్యక్రమాలు పురోగతిని ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజలతో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 అంశాలతో కూడిన బోర్డు ఏర్పాటు చేశానని తెలిపారు. ప్రతి రోజు ఆ బోర్డు చూస్తే ఆ పోలీస్‌స్టేషన్‌ని ఎవరు ఎంత పని చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. మీ పరిసర ప్రాంతంలో ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకొస్తే ఆ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పుత్తూరు డీఎస్పీ రవికుమార్,సీఐ సురేంద్రనాయుడు, ఎస్ఐ ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద కాజేసేందుకే హత్య!

- 13 లక్షల విలువగల 129 గ్రాముల బంగారం, 35 వేల నగదు స్వాధీనం

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఈనెల 11న జీవకోన, రాఘవేంద్ర నగర్ జరిగిన అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. సిరివెళ్ల శాంతమ్మ (64)ది హత్యే అని అలిపిరి పోలీసులు తేల్చి చెప్పారు. తిరుపతి డిఎస్పి భక్తవత్సలం విచారణలో నిందితులు బిజిలి జగదీష్, ఉయ్యాల హర్షిత, బండి పవన్ కుమార్, జమ్ములమడుగు శశిరేఖ, గూడూరు మురళిగా గుర్తింపు. ఎ1,ఎ2లు 2వ అంతస్తులో అద్దెకు నివసిస్తున్న కుటుంబం. 4వ అంతస్తులో నివాసముంటున్న బిల్డింగ్ యజమాని శాంతమ్మతో చనువుగా ఉంటూ హత్య చేసేందుకు ప్రణాళిక చేసారు. పథకం ప్రకారమే హత్య చేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఇంటిలో ఉన్న బంగారు నగలు డబ్బు కాజేసి పరారైయ్యారు. బిజిలి జగదీష్‌పై కిడ్నాప్, హత్యా నేరాల కేసులు ఉన్నాయి. ఉయ్యాల హర్షిత తండ్రిపై 17 ఎర్రచందనం కేసులు ఉంది. నిందితులను తిమ్మినాయుడుపాలెం బస్ స్టాప్ వద్ద అరెస్టు చేసామని తెలిపారు. అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తిరుపతి డిఎస్పి భక్తవత్సలం తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో... గ్రామాల్లో శాంతి సౌభాతృత్వం

- మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు

శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఆధ్యాత్మిక నిలయమని ఈ నియోజకవర్గంలో ఇటు శైవం అటు వైష్ణవానికి సంబంధించిన దేవాలయాలు వెలుస్తున్నాయన్నారు. బుధవారం ఆయన ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయ మహాకుంభాభిషేకం కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడుతూ పూజలతో పుణ్యాలు రావని అయితే మనం ఎదుటి వారికి సమాజానికి అందించిన సేవలు సహాయసహకారాలతో దేవుని ఖాతాలో పుణ్యాలు వస్తాయన్నారు. మనిషి జీవితం ఆశాశ్వతం అన్నారు. కాబట్టి ఈ శరీరంపై మక్కువను విడనాడి మన జీవిత రహస్యాన్ని గుర్తించి సేవా ధృక్పథంతో ముందుకు నడవాలన్నారు. ఆలయాల నిర్మాణాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుందన్నారు. మర్రిమందలో గ్రామస్థుల సౌజన్యంతో చక్కటి ఆలయాన్ని నిర్మించుకున్నారన్నారు. ఇక్కడ నిత్య పూజలతో పునీతం చేయాలని ఎస్‌సివి నాయుడు పిలుపు నిచ్చారు. ఎస్‌సివి నాయుడుకు గ్రామస్తులు ఆలయ కమిటి ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆయనతో పాటు సుదర్శనం నాయుడు, భాస్కర్‌నాయుడు, జానకి రామ్, వినయ్,ఢిల్లి, ప్రతాప్,చందు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటి చైర్మెన్ గిరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి,కోశాధికారి కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలుకె.కృష్ణరెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి,జిపి యాదవ్,టి.బలరాంరెడ్డి,రమణారెడ్డి, ఏకాంబరరెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, కె.సుబ్రమణ్యం రెడ్డి, కళత్తూరు,టి.సుదర్శనరెడ్డి,కె.విష్ణు,కె.సాయి, టి.శివలు పర్యవేక్షిస్తున్నారు.

అప్పన్న ఆలయం ఘటన దురదృష్టకరం : ఎంపీ

వెంకటగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : విశాఖలో సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో రూ.300 క్యూలైన్ వద్ద గోడ కూలిపోవడం వల్ల 8 మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం అని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి అన్నారు. తిరుపతి వైకుంఠ దర్శనం టికెట్ క్యూ లైన్లలో తొక్కిసలాట ఘటన మరవక మునుపే మరో సంఘటన జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు. భద్రతా ఏర్పాట్లలో విఫలమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

న్యాయవాదిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వెంకటగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఇటీవల అమెరికాలో మృతి చెందిన వెంకటగిరి వాసిసాయి తేజ తండ్రి సీనియర్ న్యాయవాది అయిన సాయి వరప్రసాద్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. సాయి తేజ అమెరికాలో ఎలా చనిపోయాడు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తుపాకీ మిస్ ఫైర్ అయి ప్రమాదం జరిగినట్లు ఎమ్మెల్యేకి వివరించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లం చంద్రమోహన్, మాజీ కౌన్సిలర్ పునుగోటి విశ్వనాథం నాయుడు, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు మంకు ఆనంద్, సీఐ ఏవి రమణ, ఎస్సై కామినేని గోపి తదితరులు ఉన్నారు.

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ జెడ్పీ చైర్మన్

వెంకటగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మాజీ శాసనమండలి సభ్యులు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పార్టీ వ్యవహారాలను ఆయనతో చర్చించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

పౌష్టికర ఆహారం తీసుకోవాలి : సిడిపిఓ

బాలాయపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్తమండల కేంద్రమైన బాలాయపల్లి వెలుగు కార్యాలయంలో కిషోర్ వికాసం కిషోర్ బాలికల సమ్మర్ స్పెషల్ కార్యక్రమాన్ని సిడిపిఓ శంషాద్ బేగం, ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ ఏపిఎం పోలమ్మ. నిర్వహించారు. మే నెల రెండో తేదీ నుండి జూన్ నెల 4వ తేదీ వరకు కిషోర్ వికాసంపై అవగాహన నిర్వహిస్తున్నాము అనిఎంపీడీవో వినీల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం పోలమ్మ ఏఎన్ఎంఎస్, ఎంఎస్‌యు, వివోసులు సమావేశంలో పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

వెంకటగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : 2025-26వ సంవత్సరంగాను మూడో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు వెంకటగిరి నందు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. మే నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు తరగతుల వారీగా చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలు కోసం 7386731358 ఈ సెల్ నెంబర్కు సంప్రదించాలని కోరారు.

ఉపాధి కూలీలకు గిట్టుబాటు ఉండాలి: ఎంపీడీవో

వాకాడు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఉపాధి హామీలోని కూలీలకు గిట్టుబాటు వేతనం రూ.300 తగ్గకుండా చూడాలని వాకాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం వాకాడు పంచాయతీ పరిధిలో ఉన్న గొల్లపాలెం గ్రామంలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ అమృత్ సరోవర్ ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత కూలీదారులతో ఆయన ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ పనులలో శ్రద్ధగా ఉండాలని, అలాగే కొలతల ప్రకారం రోజువారి పని చేసినట్లయితే గిట్టుబాటు కూలీ అందు తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకుడు సన్నా రెడ్డి ప్రసాద్ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ రమ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగరమాల నిర్వాసితులు ధర్నా

నాయుడుపేట ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మండలంలోని కాపులూరు గ్రామంలో సాగరమాల నిర్వాసితులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కాపులూరు గ్రామస్తులు గోవర్ధన్ మాట్లడుతూ సాగరమాల రోడ్డుకు సంబంధించి 10ఎకరాల విస్తీర్ణంలో 26మంది రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డును నిర్మిస్తున్నారని రైతులు ఆరోపించారు. మాకు నష్టపరిహారం అందించే వరకు రోడ్డుకు అడ్డంగా టెంటు వేసుకొని దర్నా చేపడుతామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో రైతులు క్రిష్ణయ్య, గోవర్ధన్, మహేశ్వరమ్మ, రామయ్య తదితరులు రైతులు ఉన్నారు.

వైసిపికి కట్టా రాజీనామా

నాయుడుపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి బుధవారం వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు జడ్పిటిసి సభ్యులు కట్టా జ్యోతిరెడ్డి, కట్టా కోటారెడ్డి, మేనకూరు సర్పంచ్ సురేష్, వైస్ఎంపిపి నల్లు కస్తూరయ్య, అత్తివరం ఎంపిటిసి సభ్యులు శేఖర్‌లు వైయస్ఆర్ కాంగ్రేస్‌పార్టీకి రాజీ